కలర్‌ఫుల్ కైట్స్

- ఆకట్టుకుంటున్న వెరైటీ పతంగులు
- మార్కెట్‌లో వేలాది డిజైన్లలో..
- అందుబాటు ధరల్లోనే లభ్యం







అకట్టుకుంటున్న వెరైటీ పతంగులు

సిరిసిల్లటౌన్: పిల్లలు, పెద్దలను మురిపించే పతంగుల పండగ వచ్చేసింది. వేలాది వెరైటీల్లో తయారైన తెలంగాణ పతంగులు ఆకట్టుకుంటున్నాయి. పేపర్, వెదురు పుల్లలతో ఆధునిక డిజైన్లలో తయారు చేసిన తయారీదారులకు పతంగులు ఉపాధి జోష్ కల్పిస్తున్నాయి. ముచ్చటగొలిపే డిజైన్లలో ఉన్న పతంగులు, పట్టణంలో పతంగుల ఆటలు..క్రయ, విక్రయాలపై సండే స్పెషల్ కథనం..

సండే స్పెషల్

చిన్నా పెద్దా తేడాలేకుండా ప్రజలు ఎగురవేస్తున్న కలర్ ఫుల్ కైట్స్ అదుర్స్ అనిపిస్తున్నాయి. కాన్పూర్, అహ్మదాబాద్, కలకత్తా, మలేషియాల్లో తయారయ్యే పతంగులను స్థానిక వ్యాపారులు వాటి డిమాండ్‌కు తగ్గట్టు తెప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగానే వేలాది వెరైటీల్లో పతంగులు లభిస్తున్నాయి. నెలరోజుల ముందు నుంచే పతంగుల ఆటలతో జిల్లాకేంద్రంలో సందడి నెలకొంది. పిల్లలు మెచ్చేలా అన్ని వెరైటీల్లో దొరుకుతుండటంతో పతంగుల అమ్మకాలు పెరిగాయి. స్థానిక లేబర్ అడ్డా, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో హోల్‌సేల్ వ్యాపారులు రిటైలర్లకు అమ్ముతున్నారు. పెద్ద బజార్, పాతబస్టాండ్, అంబేడ్కర్ రోడ్, గాంధీచౌక్, వెంకంపేట, శాంతినగర్, బీవైనగర్, కొత్తబస్టాండ్, మార్కెట్ ఏరియాయల్లో పతంగుల దుకాణాల్లో కస్టమర్లు కొనుగోలు చేస్తుండటంతో సందడి నెలకొంది.


గగనంలో రంగుల పతంగుల విహారం..

పట్టపగలే ఆకాశంలో సిరిసిల్ల గగన వీధులు వీనుల విందుగా మారింది. సాధారణ కాగితం, వెదురు పుల్లలతో చేసినవే కాకుండా క్లాత్, ప్లాస్టిక్ పేపర్లు, సిల్వర్, గోల్డ్ రంగుల పతంగులు, లాంథర్ పతంగుల అమ్మకాలు జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా కైట్స్ ఎగురవేస్తూ సరదాగా గడుపుతున్నారు. దాబాలు ఎక్కి, మైదానాల్లోకి వెళ్లి పిల్లలు ఒకరికొకరు పోటీలు పడుతూ గాల్లో పతంగులు ఎగురవేస్తున్నారు. వేలాది డిజైన్లలో మార్కెట్‌ను ముంచెత్తగా పట్టణ వాసులను ముచ్చట గొలుపుతున్నాయి.

వెరైటీ..కైట్స్

మార్కెట్‌లో వెరైటీల్లో కైట్స్ అమ్మకాలు సాగుతున్నాయి. వీటిలో తోక పతంగి, ఫిష్‌కైట్, రంగీలా, జరీ, బట్ట, సిల్వర్, గోల్డ్, లాంథర్, ఈగల్, డేగ, ట్రియాంగిల్, డ్రాగన్, కార్టూన్ లవర్స్, లవ్‌బర్డ్స్, బట్టర్ ఫ్లై, సాధారణ పతంగులు పట్టణంలో దొరుకుతున్నాయి. చిన్న, పెద్ద, సాధారణ సైజుల్లో వీటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. కైట్స్ ఎగురవేసేందుకు దారాలు, దానిని చుట్టేందుకు అందమైన చెరకాలు ప్లాస్టిక్, కర్రలతో చేసినవి లభిస్తున్నాయి. కాటన్, మాంజా దారాలు కూడా వెరైటీల్లో అమ్ముతున్నారు. పట్టణంలో రూ.10 మొదలుకుని రూ.400 విలువైన పతంగులు అమ్మకాలు జరుగుతున్నాయి. దూర నగరాల నుంచి తెప్పించి వ్యాపారులు కస్టమర్లకు సరళమైన రేట్లకే అందిస్తున్నారు.

అందుబాటు ధరల్లో



ప్రజలు కోరిన వెరైటీల్లో పతంగులు సిద్ధంగా ఉన్నా యి. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చి మావద్దే కొనుగోలు చేస్తారు. లాంథర్ వంటి వెరైటీ పతంగులకు కూడా డిమాండ్ ఉంది. నగరాల్లో లభించే రీతిల్లో కొత్త రకమైన పతంగులను అందరికీ అందుబాటు ధరల్లో అమ్ముతున్నాం.

– ఎలగందుల రమేశ్, చిరువ్యాపారి

సరదాగా ఎగురవేస్తున్నాం



సంక్రాంతి పండుగకు ఫ్రెండ్స్‌తో కలిసి గాలిపటాలు ఎగురవేయడం సరదాగా ఉంటుంది. వెరైటీ డిజైన్లలో కైట్స్ అమ్ముతున్నారు. ధరలు కూడా తక్కువే. మార్కెట్లో దొరుకుతున్న కైట్స్ క్రేజీగా ఉన్నాయి. బొమ్మలు, పక్షుల రూపాలతో గాలిపటాలు అందంగా ఉన్నాయి. ధరలు కూడా తక్కువే.

– వంగ శ్రీమాన్, 7వ తరగతి విద్యార్థి

జాగ్రత్తలు పాటిస్తాం



పెద్దలు చెప్పినట్లుగా కైట్స్ ఎగురవేసేప్పుడు జాగ్రత్తలు పాటిస్తాం. సంక్రాంతి వచ్చిందంటే పతంగులు ఆడుతూ దోస్తులతో సరదాగా గడుపుతాం. గాలిలో పతంగులు ఎగురుతుంటే స్నేహితులతో కలిసి సంతోషపడతాం. చిన్నప్పటి నుంచి కైట్స్ ఎగురవేయడం చాలా ఇష్టం.

– ఎస్‌కే. మోసిన్, 7వ తరగతి విద్యార్థి

క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



వేములవాడ: గూగుల్, సెల్‌ఫోన్లలో చదివే కన్నా పుస్తకాల ద్వారా చదవడం చాలా ఉపయోగకరమని, విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటామని డాక్టర్ పద్మావతి, నాగరమేశ్ దంపతులు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి శనివారం రెండో దఫా రూ. 20 వేల విలువైన పుస్తకాలను లైబ్రేరియన్ అనిత చేతుల మీదుగా రీడర్స్‌కు అందజేశారు. లైబ్రేరియన్ అనిత మాట్లాడుతూ ఇటీవలే నూతనంగా నిర్మించని గ్రంథాలయంలో పూర్తిస్థాయి పుస్తకాలు లేవనీ, ఎవరైనా వైద్య దంపతుల మాదిరిగానే పుస్తకాలు డొనేట్ చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైద్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజికల్ సైన్స్‌తో పాటు బీఈడీ అర్హత కలిగిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో పాఠశాలలో హాజరుకావాలని సూచించారు.

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి అనూష శనివారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులపై అక్కడున్న రైతులతో మాట్లాడారు. రైతులు ఏది కొనుగోలు చేసిన రశీదులు తీసుకొని సూచించారు. రికార్డులను పరిశీలించారు. ఎవరైనా నకిలీ ఎరువులు, ఫెర్టిలైజర్ విక్రయాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమిటీ ఎన్నిక



ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం చెరువు నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చెరువు కమిటీ చైర్మన్‌గా గోస్కుల నారాయణ, వైస్ చైర్మన్‌గా ముత్యాల యాదగిరిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడానికి రైతులు, అధికారులు సహకరించాలన్నారు.

యూనివర్సిటీ సందర్శన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8, తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అండ్ కళాశాలను శనివారం సందర్శించారు. యూనివర్సిటీలోని వ్యవసాయ పరిశోధనలను తెలుసుకున్నారు, వ్యవసాయంలో నూతన పరిశోధనలు, వంగడాలను విద్యార్థులు పరిశీలించారు. ప్రిన్సిపాల్ జి. శ్రీదేవి విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు రెడ్డి తెలిపారు. అకాడమిక్ ఇన్‌చార్జి షాహిద్, ప్రణవి, రజిని, వెంకన్న, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వీర్నపల్లి: మండల వనరుల కేంద్రంలో శనివారం తెలంగాణ ప్రోగ్రెస్సింగ్ టీచర్స్ ఫెడరేషన్ 2025 క్యాలెండర్‌ను మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం టీపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు పొన్నం శ్రీనివాస్, సుల్తాన్ శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యారంగంలో ఉన్న అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో పేద ప్రజలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వపరంగా గ్రామస్థాయి అధికారుల సర్వేను పూర్తిచేసే దశలో ఉన్నారన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన పేదలకు అధికారుల విచారణ అనంతరం ఇళ్ల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దళారుల ఎలాంటి ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇళ్ల మంజూరుకోసం ఎవరిని ఆశ్రయించవద్దన్నారు.

జర్నలిస్టులకు చుక్కెదురు

తంగళ్లపల్లి: మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లిన తంగళ్లపల్లి జర్నలిస్టులకు చుక్కెదురైంది. కేటీఆర్‌ను కలిసేందుకు ఆయన ఉన్న గదికి వెళుతుండగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మీకు ఇక్కడేమి పనంటూ నిలదీశారు. ఓ విలేకరిని చేయిపట్టి మరీ లాగారు. ఈ ఘటనతో అవాక్కయిన జర్నలిస్టులు కేటీఆర్‌ను కలవకుండానే వెనుదిరిగి వచ్చారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తలారి రాణి

ముస్తాబాద్: పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. మండలంలోని పోతుగల్ ఏఎంసీ పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ రాణి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యార్డులో సీసీపనులు, డ్రైనేజీ, కవర్ షెడ్డు నిర్మాణాలకు తీర్మానం చేశామన్నారు. తాగునీటికి బోరువెల్, పైపులైన్ నిర్మాణం చేస్తామన్నారు. ఏఎంసీకి స్వాగత తోరణం, ఎడ్లబండితో కూడిన రైతువిగ్రహం నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు పడిపోయిన ప్రహరీని పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. రైతులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గత వానాకాలం పంట ధాన్యం సేకరణకు అన్ని వసతులు కల్పించి, రికార్డులో స్థాయిలో ధాన్యం సేకరణకు కృషి చేశామన్నారు. వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి హరినాథ్, డైరెక్టర్లు బొప్ప శంకర్, కదిరె సత్తయ్య, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, రాజు, మున్నా, బుచ్చయ్య, రాములు, సుధాకర్‌రావు, యాదగిరిరెడ్డి, ఆపరేటర్ నిషాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేటీఆర్‌కు రాజన్న ప్రసాదం అందజేత



కేటీఆర్‌కు రాజన్న ప్రసాదం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, తదితరులు

వేములవాడ: మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి–రాజు దంపతులు, నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు శనివారం రాజన్న ప్రసాదం అందజేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో కలిసి రాజన్న ప్రసాదం అందజేసిన అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేకే చొరవతో దివ్యాంగురాలికి ఉద్యోగం



ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో ఓ దివ్యాంగురాలికి ఉద్యోగం వచ్చింది. ముస్తాబాద్‌కు చెందిన గొట్టె సుమలత అనే దివ్యాంగురాలు ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం లేదు. తల్లి దండ్రులను కూడా తనకు వచ్చే పింఛన్‌తోనే పోషిస్తోంది. సిరిసిల్ల కలెక్టరేట్‌కు శనివారం వెళ్లిన సుమలత అక్కడ కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని కలిసి తన గోడును వెల్లబోసుకుంది. దీంతో స్పందించిన మహేందర్‌రెడ్డి వెంటనే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విషయం తెలిపాడు. కలెక్టర్ సుమలతకు కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం కల్పించేందుకు ముందుకొచ్చారు. కలెక్టరేట్‌లోనే ఆపరేటర్‌గా అవకాశం కల్పించారు. ఉద్యోగం కల్పించిన కలెక్టర్, కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డికి సుమలత కృతజ్ఞతలు తెలిపింది. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజు, తదితరులున్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలకసంఘం సాధారణ సమావేశాన్ని ఈనెల6న నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో సమావేశం నిర్వహించిన అనంతరం సమావేశం ఉంటుందన్నారు.

విజేతలకు అభినందన



సిరిసిల్లకల్చరల్: సీఎం కప్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్, ఉషు పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించిన విద్యార్థులను, సైకాలజిస్ట్ పున్నం చందర్, కుంగ్‌ఫూ మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్ అభినందించారు. శనివారం వెంకంపేటలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో స్పార్క్ కుంగ్‌ఫూ బెల్ట్ గ్రేడింగ్ అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయాన్, ప్రవల్లిక, లోకేష్, శ్రీరామ్ వరుసగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం సుమారు 120 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి వందమందికి బెల్టుల ప్రదానం చేశారు. విద్యార్థుల కటాఫ్, ఫైట్, నాంచాక్ మూమెంట్స్, సెల్ఫ్ డిఫెన్స్ విన్యాసాలు అలరించాయి. పలు పాఠశాలల నిర్వాహకులు శ్యామ్, నరేశ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మల్లుగారి'కి తెలుగు వెలుగు నంది పురస్కారం



నర్సాగౌడ్

గంభీరావుపేట: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో అందించే తెలుగు వెలుగు నంది పురస్కారానికి గంభీరావుపేటకు చెందిన సామాజిక కార్యకర్త, మా అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ ఎంపికయ్యారు. ఈనెల 11న హైదరాబాద్‌లో ఈ పురస్కారం అందుకోనున్నారు.

మట్టి నమూనా సేకరణ

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధి కోనాయపల్లి వ్యవసాయ భూముల్లో వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలను సేకరించారు. పంట సాగు యొక్క సారాంశం, కార్బన్ పదార్థాలు, ఎరువులు వాడే విధానాలపై వాటిపై ఈ నమూనాల ద్వారా తెలుసుకుంటారు. ఏవో సాయికిరణ్, ఏఈవోలు రాజు, రైతులు ఉన్నారు.

మద్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని సాయిబాబా గుడి దగ్గరలో కిరాణదుకాణం నడుపుతున్న అంగూరి బుచ్చయ్య ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో అతని కిరాణషాపులో తనిఖీ చేయగా రూ.2700 విలువ గల మద్యం బాటిళ్లు లభించినాయి. మద్యం సీజ్ చేసి, అంగూరు బుచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

వ్యక్తి రిమాండ్

చందుర్తి: ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ కేసులో మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన నేరెళ్ల రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ కథనం ప్రకారం ... చందుర్తి గ్రామానికి చెందిన లింగాల వజ్రవ్వకు చెందిన ఇంటిని తన సోదరుడు నర్సింగపూర్ గ్రామానికి చెందిన చింతకుంట మల్లయ్య కూతురు చింతకుంట వజ్రవ్వ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించాడన్న ఫిర్యాదు మేరకు నేరెళ్ల రమేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు వివరించారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: మండెపల్లి గ్రామానికి చెందిన షమీం ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి రూ.47,600 దాతలు శనివారం అందజేశారు. మొత్తం షమీం కూతురు పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నారు.

పశు వైద్యశిబిరం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శనివారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి నిఖిల మాట్లాడుతూ రుణాలపై ఆవులు, గొర్రెలు, గేదెలు తీసుకునే రైతులు ఎలాంటి రుసుం తమ కార్యాలయంలో, సిబ్బందికి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆఫీస్ సబార్డినేట్ తిరుపతి రెడ్డి, రైతులు మెంగని మహేందర్, దేవిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొండ బ్రదర్స్‌పై కేసు నమోదు

వేములవాడ: వేములవాడ అర్బన్ మండలం మారుపాక శివారులోని ఓ భూమి విషయంలో మోసానికి పాల్పడిన పట్టణానికి చెందిన కొండ దేవయ్య, కొండ నర్సయ్య సోదరులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ శనివారం తెలిపారు. మారుపాక శివారులో దేవయ్య, నర్సయ్యకు సంబంధించిన రెండకరాల భూమిని మారుపాకకు చెందిన నాగరాజుకు రూ. 4.20 కోట్లకు విక్రయించారు. ఇందుకు రూ.3.50 కోట్లు చెల్లించినప్పటికీ ఒప్పందం ప్రకారం పూర్తిస్థాయిలో భూమి రిజిస్ట్రేషన్ చేయడంలేదని, అడిగితే బెదిరి స్తున్నారని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గతంలోనూ ఓకేసు వీరిపై ఉన్నట్లు చెప్పారు.



ముస్తాబాద్: మండలంలోని గూడెం రైతువేదిక అసంపూర్తిగా ఉంది. నాలుగేళ్లుగా నిర్మిస్తుండగా నిధుల లేమితో రైతువేదిక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గూడెం, కొండాపూర్, రాంరెడ్డిపల్లె రైతుల కోసం గూడెం క్లస్టర్‌లో భాగంగా నిర్మిస్తున్న రైతువేదిక ఏళ్లుగా నిర్మిస్తున్నారు. మండలంలో అన్ని క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించిన అధికారులు గూడెంలో పనులు పూర్తిచేయడం లేదని రైతులు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
అనూష, మండల వ్యవసాయాధికారి, సెల్ నెంబర్:9390263560

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పరామర్శలు.. ఆశీర్వాదాలు



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో శనివారం పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలువురిని పరామర్శించారు. సాక్షి సిరిసిల్ల ఆర్సీ ఇన్‌చార్జి పూరడి మల్లికార్జున్ తల్లి రామవ్వ ఇటీవల మృతిచెందగా ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. రామవ్వ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మరో సీనియర్ విలేకరి(సాక్షి కాదు) చల్ల ప్రసాద్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి మృతిచెందగా వారింటికి వెళ్లి పరామర్శించారు. 24వ వార్డు కౌన్సిలర్ బుర్ర లక్ష్మి మనవడు బుర్ర సూర్యాంశ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా వారింటికి వెళ్లి ఆశీర్వదించారు. బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి కూతురు వివాహం ఇటీవల జరుగగా వారింటికి వెళ్లి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆపదొస్తే అర్ధరాత్రైనా స్పందిస్తా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చందుర్తి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి : ఆపదొస్తే అర్ధరాత్రైనా ఫోన్‌కాల్‌కు స్పందిస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి రైతువేదికలో 53 మందికి కల్యాణలక్ష్మీ, 52 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.2లక్షలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రస్తుతం ఆ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచిందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే నియోజకవర్గంలోని 170 మందికి వైద్యం అందించేందుకు ఎల్‌వోసీలను, 2వేల మందికి పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే మోత్కురావుపేట రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన ఎల్లంపల్లి ప్రాజెక్టు కాలువ పనులను ప్రారంభం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ శ్రీ నివాస్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రా మస్వామి, రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకరయ్య, ఏనుగు లచ్చిరెడ్డి, ఈసరి శ్రీనివాస్, ననుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముస్కు ము కుందరెడ్డి, నాయకులు గొట్టే ప్రభాకర్, పులి స త్తయ్య, బండారి శేఖర్, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్ కిట్స్ పంపిణీ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏటా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా గత ప్రభుత్వాలు విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచలేదన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్తీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కే దేవరాజం, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులున్నారు.

గ్రామాల్లోకి వస్తే తరిమి కొడతారు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ప్రజలు కొడతారని మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీటీసీ ఆ ఫీస్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. అందె సుభాష్, నమిలికొండ శ్రీనివాస్, సింగారం దేవరాజు, ఎడ్ల లక్ష్మణ్, మీసం రాజ్యం, నాగరాజు, అప్సర్ ఉన్నిసా, నరసింహులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

తంగళ్లపల్లి: తమ కాలనీలో వీధిదీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీలో సారంపల్లి ప్లాట్స్ యువకులు శనివారం వినతిపత్రం అందజేశారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తీసుకొచ్చిన వంటకాలను ప్రదర్శించారు. మాజీ సర్పంచ్ శంకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: బుగ్గరాజేశ్వర తండాలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురికి బీఆర్ఎస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దరావత్ తిరుపతికి రూ. 60వేలు, మరో నలుగురికి చెక్కులు పంపిణీ చేశారు.